వైభవం.. నగరోత్సవం

- హరోంహర నామస్మరణతో మార్మోగిన నాయుడుపేట, వెంకటగిరి
- పురవీధుల్లో భక్తులను కటాక్షించిన సుబ్రహ్మణ్యేశ్వరుడు



నాయుడుపేట: 108 వేలాయుధాలతో నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని వళ్లీ దేవసేన సమేత షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆడికృత్తిక సందర్భంగా మంగళవారం వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధులన్నీ హరోంహర నామస్మరణతో మార్మోగాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చడలవాడ మోహన్‌కృష్ణ శర్మ ఆధ్వర్యంలో 108 మంది భక్తులు స్వామివారి వేలాయుధాలను చేతపట్టి స్వామివారి నగరోత్సవంతో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద స్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా ముందుగా స్వామివార్లకు ఉభయదాతలచే పంచామృతాభిషేక పూజలు చేపట్టి, వందలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం సుబ్రహ్మణ్య మూలమంత్ర హోమ పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి ప్రత్యేక మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి నగరోత్సవం శోభాయమానంగా జరిగింది. కార్యక్రమంలో ఉభయదాతలు, ఆలయ నిర్వాహకులు రవికుమార్ శర్మ, గణేష్ శర్మతో పాటు భక్తులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పిచ్చిరెడ్డితోపువీధిలోని విజయగణపతి ఆలయం వద్ద, మండల పరిధిలోని చిగురుపాడు అగ్రహారం వద్ద ఉన్న బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వెంకటగిరిలో..

వెంకటగిరిరూరల్ : ఆడికృతికను పురస్కరించుకుని పట్టణంలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో వేడుకలు వైభవంగా జరిగాయి. సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. అదేవిధంగా అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. వేద పండితుల మంత్రోశ్చరణాల మధ్య ప్రత్యేక హోమాలు నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామిని పూలతో విశేషంగా అలంకరించారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

కనుల పండువగా గ్రామోత్సవం ..

శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ సమీపంలో ఉన్న స్వామివారి భారీ విగ్రహానికి ముందుగా అభిషేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివారిని మయూర వాహనంపై కొలువు దీర్చారు. అనంతరం పట్టణ పురవీధుల్లో స్వామివారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళల కోలాటాలు, కేరళవాయిద్యాలు, భక్తుల హరోహర నామస్మరణ నడుమ విశేష అలంకరణంలో గ్రామోత్సవం జరిగింది. మహిళలు అధిక సంఖ్యలో కలశాలతో గ్రామోత్సవంలో పాల్గొనడం ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.



సూళ్లూరుపేట: కల్యాణోత్సవం అనంతరం ప్రత్యేక అలంకరణలో స్వామివారు



వెంకటగిరి: ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి



గ్రామోత్సవంలో కలశాలను ఊరేగింపుగా తెస్తున్న మహిళలు



వెంకటగిరి: పురవీధుల్లో దర్శనమిస్తున్న వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి

క్లుప్తంగా

నేడు నేదురుమల్లి రాక

సైదాపురం : తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం సైదాపురం మండలంలో పర్యటించనున్నట్లు మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్ యాదవ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా మండలంలోని గంగదేవిపల్లి గ్రామానికి చెందిన తిరిపిదాసు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శిస్తారని చెప్పారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో పార్టీ పరిస్థితులపై ప్రత్యేకంగా సమీక్షిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో పడమరవీధి, సాయిబాబా మందిరంలో వెలసిన శ్రీఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, సామూహిక మహాకుంభాభిషేకం, పూలంగిసేవ నిర్వహించారు. ప్రతి మంగళవారం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. అనంతరం స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

స్కూళ్లలో తనిఖీలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ కృష్ణయ్య

దొరవారిసత్రం : మండలంలోని మైలాంగం, నేలపట్టు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను మంగళవారం స్థానిక ఎంఈఓ కృష్ణయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు విద్యార్థుల వివరాలు, పాఠశాల స్థితిగతులను తప్పనిసరిగా నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ



స్కూల్ బ్యాగ్‌లు అందజేస్తున్న ప్రిన్సిపల్

నాయుడుపేట టౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం పూర్తిస్థాయిలో స్టూడెంట్ కిట్లను పంపిణీ చేసినట్లు ప్రిన్సిపల్ హనుమంతరావు వెల్లడించారు. విద్యార్థులకు యూనిఫాం, బ్యాగులు, నోటు పుస్తకాలు ఉన్నాయి. అయితే స్థానిక కళాశాల విద్యార్థులు మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను కలిసి వారికి అద్దెవసతి గృహానికి సంబంధించి సమస్యలు చెప్పుకున్నారు. అంతేగాకుండా గత ప్రభుత్వం అందించిన అమ్మఒడి, విద్యాదీవెన అందలేదని చెప్పినట్లు విద్యార్థులు తెలిపారు. విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల పంపిణీకి సంబంధించి ఎంఈఓ మునిరత్నం పర్యవేక్షించారు.


బాల్య వివాహాలు నేరం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న మెహబూబా

గూడూరు రూరల్: విందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ మెహబూబా విద్యార్థులకు బాల్య వివాహాల నిషేధ చట్టం–2006 గురించి అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. హెచ్‌ఎం నాగమల్లికార్జునరావు, శ్రీనివాస్, ప్రవీణ్, సుజాత, పద్మ, కోటేశ్వరి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం..



మాట్లాడుతున్న సీడీపీఓ శంషాద్‌బేగం

వెంకటగిరి(సైదాపురం): ఆడబిడ్డలకు బాల్యంలోనే వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని సీడీపీఓ శంషాద్‌బేగం తెలిపారు. 100 రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా మండలంలోని వల్లివేడు ఎస్టీకాలనీలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడబిడ్డలకు చిన్న వయసులోనే వివాహాలు జరిపితే వారు పోషకాహార లోపానికి గురై ఆరోగ్యం క్షీణింపజేస్తుందన్నారు. అంతేగాకుండా చట్టపరమైన నేరమని, ఇందుకు శిక్షార్హులవుతారని హెచ్చరించారు. అదేవిధంగా డయారియాపై పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మహిత, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

గూడూరు రూరల్ : గూడూరు పడమరలోని జక్కా వెంకయ్య శ్రామిక నగర్‌లో నివసిస్తున్న పేదలపై పోలీసుల ప్రోద్బలంతో దౌర్జన్యానికి దిగిన ఎస్వీ ఆర్ట్స్ కళాశాల యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం టౌన్ కార్యదర్శి జోగి శివకుమార్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ శ్రామికనగర్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వారు 20 ఏళ్ల నుంచి నివసిస్తున్నారని తెలిపారు. వీరికి అధికారులు అన్ని వసతులు సమకూర్చారన్నారు. ఎస్వీ కళాశాల యాజమాన్యం డ్రైనేజీ వాటర్ వెళ్లకుండా గోడ నిర్మించడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. అంతేగాక వారిపై పోలీసులతో బెదిరింపులకు దిగుతున్నారని, వారికి అండగా తాము నిలబడతామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసులు,బీవీరమణయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కోట: కోటకు చెందిన శ్రీషిర్డీ సాయి అక్షయ సేవా సమితి సభ్యులు మంగళవారం అన్నమేడుకు చెందిన అనిత కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఇంటి యజమాని మృతితో ఇద్దరు పిల్లల చదువులకు ఇబ్బంది పడుతున్న ఆమెకు అండగా నిలిచారు. హైదరాబాద్‌కు చెందిన ఓరుగంటి సుధాకర్‌శర్మ దాతృత్వంతో నగదు అందజేశారు. కార్యక్రమంలో సేవాసమితి చైర్మన్ అల్లం రమణయ్య, అనంతాచార్యులు, దామోదర్, పన్నగ సాయి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం..

చిట్టమూరు(చిల్లకూరు): చిట్టమూరు మండలంలోని మల్లాం గ్రామంలో వెలసిన శ్రీవళ్లీ దేవసేన సుబ్రహ్మణేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారి శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సాయికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆడికృత్తిక వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా మొక్కులు చెల్లింపులో భాగంగా కావళ్లు తీసుకొస్తారు. అందులో భాగంగానే ఉదయం స్వామివారికి పాలాభిషేకం చేసిన అనంతరం ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం వళ్లీదేవసేనతో పాటు స్వామివారి ఉత్సవమూర్తిని 1000 కాళ్ల మండపంలోకి తీసుకొచ్చి శాంతి కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈఓతో పాటు ట్రస్టు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



చిట్టమూరులో సుబ్రహ్మణేశ్వరస్వామి శాంతికల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఉపాధిహామీ పనుల పరిశీలన



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

నాయుడుపేట టౌన్ : మండల పరిధిలోని కల్లిపేడు గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్ మంగళవారం పరిశీలన చేశారు. గ్రామంలో చెరువులో నీటి గుంతలకు సంబంధించి 100 మంది ఉపాధి పనులు చేస్తుండడాన్ని గుర్తించారు. పనులు వద్ద ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్, ఇతర సిబ్బందితో ఎంపీడీఓ మాట్లాడారు. రోజుకు రూ.300 వేతనం చెల్లించేలా పనులు చేయించాలని సూచించారు. అక్కడ పని చేస్తున్న ఉపాధి కూలీలు మాట్లాడుతూ తమకు రెండు నెలల నుంచి ఉపాధి వేతనాలు అందడం లేదని వాపోయారు. దీనిపై ఎంపీడీఓ స్పందిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అందేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

ఎస్సీ కార్పొరేషన్‌ను ప్రారంభించాలి



నిరసన తెలుపుతున్న మాజీ ఎంపీ చింతామోహన్

గూడూరు రూరల్: ఎస్సీ కార్పొరేషన్‌ను వెంటనే ప్రారంభించాలని కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీ చింతామోహన్ డిమాండ్ చేశారు. గూడూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్లను ఇందిరాగాంధీ హయాంలో ప్రారంభించామని నేడు అవి మూతపడ్డాయన్నారు. దుగ్గరాజపట్నం ఓడరేవును ఎవరూ ఆపలేరన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ రామకృష్ణారావు, చంద్రశేఖర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

చిరుద్యోగుల తొలగింపు అన్యాయం



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నేతలు

వెంకటగిరిరూరల్ : చిరుద్యోగులైన వీఓఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశావర్కర్లను తొలగింపు అన్యాయమని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నివాసం వద్దకు చేరుకుని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బాలాయపల్లి మండలం నుంచి విధుల నుంచి తొలగించిన వీఏఏలతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 45 రోజులకే గ్రామాల్లోని కొందరు నేతలు రాజకీయ కక్షసాధింపుల్లో భాగంగా చిరుద్యోగులైన వీఓఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లను తొలగించాలని అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు చేస్తున్నట్లు వాపోయారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా బాలాయపల్లి మండలంలోనే అరాచకాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఆశా వర్కర్ కృష్ణవేణితో పాటు వీఓఏలు వాణి, మాధవి, మమత, హజరతమ్మను విధుల నుంచి తొలగించారన్నారు. అదేవిధంగా మరికొంతమందిని తొలగించే దిశగా కొందరు అధికారులపై ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కుల్లూరు జాన్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంపై కేసు నమోదు

కోట: విద్యానగర్ యూనియన్ బ్యాంకులో జరిగిన అగ్నిప్రమాదంపై బ్యాంక్ మేనేజర్ ప్రేమ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగబాబు మంగళవారం తెలిపారు. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో బ్యాంకులోని కంప్యూటర్లు, ఏసీలు, ఫర్నీచర్ అగ్నికి ఆహుతైనట్లు తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్లు చెప్పారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న చైర్‌పర్సన్ దీపిక

నాయుడుపేటటౌన్ : మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.2 కోట్ల నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా, కౌన్సిల్‌లో వాటిని ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానం చేశారు. మంగళవారం నాయుడుపేట మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన కమిషనర్ జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ సమావేశం జరిగింది. ముందుగా అజెండాలో రూపొందించిన 61 అంశాలకు సంబంధించి పనుల వివరాలను చదివి వినిపించారు. అనంతరం వాటిపై చర్చించి కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. దీనిపై పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అందరి సహకారం అవసరమని చైర్‌పర్సన్ కటకం దీపిక తెలిపారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో ఆక్రమణల తొలగింపుపై ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవద్దని టౌన్ ప్లానింగ్ అధికారులకు కోఆప్షన్ సభ్యులు చదలవాడ కుమార్ సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే చైర్‌పర్సన్‌తో పాటు, కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చి అందరి సహకారంతో చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే పట్టణంలో కూలగొట్టిన ఇళ్ల వ్యర్థాలను స్వర్ణముఖి నదిలో పడేసి, డంప్ యార్డుగా మార్చేస్తున్నారని, వాటిని నియంత్రించాలని పలువురు కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. అలాగే పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లోని ప్రస్తావించారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. సమావేశంలో వైస్ చైర్మన్ జలదంకి వెంకట కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు దారా రవి, చంద్రారెడ్డి, అశోక్ కుమార్, కోఆప్షన్ సభ్యులు భవాన్, మేనేజర్ ఎంకే ఖాజామొహిద్దీన్, టీపీఓ శాంతి, డీఈ శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షాజహాన్, మున్సిపల్ ఏఈ చంద్ర, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి కార్తీక్

గూడూరు రూరల్: ఆయల్ పామ్ సాగు చేయడం ద్వారా మంచి లాభాలు పొందవచ్చని మండల ఉద్యానశాఖ అధికారి కార్తీక్ తెలిపారు. మండలంలోని కొండాగుంట, పారిచెర్ల రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు హెక్టారుకు 150 మొక్కలు నాటుకుంటే ఆశాజనకంగా ఉంటుందన్నారు. ఆయిల్‌పామ్ సాగులో 5వ ఏడాది నుంచి హెక్టారుకు 2 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుందన్నారు. ఏడాదికి సుమారు రూ.60 వేల ఖర్చు అవుతుందని, సుమారు రూ.1.35 లక్షల వరకు ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ సుమలత, వీఏఏ శివ పాల్గొన్నారు.

సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ





రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, వరి పైరును పరిశీలిస్తున్న అధికారులు

పెళ్లకూరు: భూసార పరీక్షా ఫలితాలు ఆధారంగా మేలైన సాగు పద్ధతులు చేపట్టడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి కేవీ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. మంగళవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో నెలబల్లి గ్రామంలోని రైతులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మేలైన వ్యవసాయ సాగు పద్ధతులపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులతోనే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించి తద్వారా మంచి లాభాలను పొందవచ్చన్నారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు విపరీతంగా వినియోగించడం వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు. అందువల్ల సేంద్రియ ఎరువులు వాడకంపై మక్కువ కలిగి అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం వ్యవసాయ పొలాల్లోని వరిసాగును పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ ప్రవీణ, రైతులు పాల్గొన్నారు.

గిరిజన కుటుంబానికి చేయూత

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని శ్రీనివాసపురం ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన తుపాకుల రమణయ్యకు పనబాక భూలక్ష్మీ సేవాసమితి వారు మంగళవారం చేయూత అందించారు. రమణయ్య పక్షవాతంతో మంచానికి పరిమితమయ్యాడు. దీనికితోడు రమణయ్య భార్య తుపాకుల సుబ్బమ్మ దిగాలుతో 17వ తేదీ నాడు గుండెపోటుతో మృత్యువాత పడింది. దీంతో వారి కుటుంబం నిస్సహాయ స్థితిలో ఉన్న విషయం తెలిసి ఆ గిరిజన కుటుంబానికి సేవాసమితికి చెందిన పనబాక గంగాబాబు బియ్యం బస్తా, కూరగాయలు అందించారు. అదేవిధంగా మంచానికి పరిమితమైన రమణయ్యకు ప్రభుత్వం తరపున సాయం అందించేలా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు ఆయన తెలిపారు.

కండలేరులో 6.145 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 6.145 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 130, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పొదలకూరు-తిరుపతికి బస్సు సర్వీసు

రాపూరు: రాపూరు ఆర్టీసీ డిపో నుంచి పొదలకూరు-తిరుపతికి బస్సు సర్వీసును ఆగస్టు 1 నుంచి నడపనున్నట్లు డిపో మేనేజర్ అనిల్‌కుమార్ తెలిపారు. పొదలకూరులో ఉదయం 7.30 గంటలకు బయలుదేరి రాపూరు, వెంకటగిరి మీదుగా తిరుపతికి చేరుకుంటుందన్నారు. అలాగే తిరుపతిలో సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమై రాపూరుకు వచ్చేలా సర్వీసు ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.